# అవినీతికి చిరునామా కాంగ్రెస్: బాలకృష్ణ



నందిగామలో బాలయ్య అభిమానుల కోలాహలం



సత్తెనపల్లిలో బాలకృష్ణ బహిరంగ సభ

పిడుగురాళ్ల, సత్తెనపల్లి, పెదకూరపాడు - న్యూస్‌టుడే

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అవినీతికి చిరునామాగా పేరు మోసిందని నందమూరి బాలకృష్ణ విమర్శించారు. గురువారం పిడుగురాళ్ల, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో జరిగిన రోడ్‌షోలలో చైతన్యరథంపై నుంచి మాట్లాడారు. వైఎస్ పాలనలో రాష్ట్రం భూకబ్జాదారుల పాలిట అడ్డాగా మారిందన్నారు. సెజ్‌ల పేరిట బలవంతంగా భూములు లాక్కుని పేదవాడి నిలువనీడ లేకుండా చేశారన్నారు. నాడు ప్రజల కోసం చంద్రబాబు శ్రమదానంచేస్తే నేడు కొడుకు కోసం వైఎస్ భూదానం చేస్తున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు అందుబాటులో ఉన్నాయా, గిట్టుబాటు ధరలు దక్కుతున్నాయా, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారా అంటూ స్థానికులను ప్రశ్నించి వారి స్పందనను రాబట్టారు.



అభిమానుల కోరిక మేరకు తొడగొడుతూ..

## పుచ్చుకోవడం.. ఇచ్చుకోవడం.. మెచ్చుకోవడం ఇదే కాంగ్రెస్ పంథా

పుచ్చుకోవడం.. ఇచ్చుకోవడం.. మెచ్చుకోవడం అనే మూడుసూత్రాలే కాంగ్రెస్ పాలకులకు తెలుసని నందమూరి బాలకృష్ణ ఎద్దేవా చేశారు. ముడుపులు పుచ్చుకోవడం.. భూములు ఇచ్చుకోవడం.. కేంద్రంలో ఉండే పెద్దోళ్లకు వాటాలిస్తే వాళ్లు మెచ్చుకోవడం.. ఇదే వాళ్లకు తెలిసిన పాలన అని విమర్శించారు. ఎర్రటి ఎండలో సైతం ఎంతో దూరం నుంచి తరలివచ్చారని అభిమానుల్ని ప్రశంసిస్తూ.. ఈ 'సన్‌స్ట్రోక్' కాంగ్రెస్‌కు తగలాలని పేర్కొన్నారు. జస్టిస్ చౌదరి వారసులై.. కొండవీటి సింహం కుమారులై.. బొబ్బిలిపులిబిడ్డలై.. కాంగ్రెస్ గుండెలపై సమ్మెట పిడుగులు పడేలా ఏకైక ఆయుధం ఓటుతో బుద్ధి చెప్పాలని బాలకృష్ణ పిలుపునిచ్చారు. బరిలో ఉన్న తెదేపా అభ్యర్థులను గెలిపించాలని వారి పేర్లతో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అభిమానులు, కార్యకర్తల కోరికమేరకు ఆయన తొడగొట్టి మీసం మెలేశారు.

## ప్రజలు కోరితే సేవకు వస్తారా?

మార్పుకై ప్రజాసేవ చేసేందుకు వచ్చామంటూ ప్రజారాజ్యం పార్టీ నాయకులు చెప్పుకుంటున్నారన్నారు. ప్రజలు కోరితే సేవ చేయడానికి వచ్చానని



పిడుగురాళ్లలో పూలదండ, ముస్లిం టోపీతో..

ఆ పార్టీ అధినేత చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పెళ్కా, పేరంటామా ప్రజలు రమ్మని పిలవడానికి అన్నారు. రాజ్యాధికారం దక్కని వారిని ప్రోత్సహించకుండా వలస నాయకులతో ఎలా సామాజిక న్యాయం సాధిస్తారని చిరంజీవిని సూటిగా ప్రశ్నించారు. తెదేపా అధికారంలోకి రాగానే మ్యానిఫెస్టోలో పొందుపర్చిన నగదు బదిలీ పథకం, కలర్ టీవీలు, ఎన్టీఆర్ సమగ్ర ఆరోగ్యశ్రీ పథకాలను అమలు చేస్తుందన్నారు.